క్లుప్తంగా

పుస్తకాల నిల్వ కేంద్రం పరిశీలన



పొన్నూరు: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్, షూ, బెల్ట్, నోట్ పుస్తకాలు, డిక్షనరీలను అందజేయనున్నారు. పుస్తకాలకు నిల్వ కేంద్రంగా కేటాయించిన నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయం సీయంఓ డి.అనిల్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి, పాఠశాల హెచ్ఎం జె.శివలక్ష్మీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణీలు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రత్నం తెలిపారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ భాగంగా 1000 రోజుల సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసే వంటలు చేసి ప్రదర్శించి తల్లులు, గర్భిణీలు ఏవిధంగా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కె.వి.కె సైంటిస్ట్ దీపా, ఏఎన్ఎం ఇందిరా, జీవనజ్యోతి, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, వసంత, నవ్య, కృపావతి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తు ఆటో ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం జరిగింది. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన షేక్ మున్నా నారాకోడూరు ప్రాంతంలో పుచ్చకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పుచ్చకాయల బండితో రోడ్డు పక్కన వెళుతున్న మున్నాను వెనుక నుంచి వచ్చి ఆటో వేగంగా ఢీకొట్టింది. దీంతో మున్నాకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు గుంటూరులో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన్ని పురస్కరించుకొని ప్రపంచ శాంతి, భారత దేశ సమైక్యత కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం ఆరు గంటలకు గుంటూరు నగరంలో వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ పాస్టర్ రెవరెండ్ గనుపల్లి సతీష్ బాబు తెలియజేశారు. స్థానిక సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో గురువారం రన్ ఫర్ జీసస్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ జి.సతీష్ బాబు మాట్లాడుతూ క్రైస్తవులు, శాంతి సమాధానానికి చిహ్నమని తెలియజేస్తూ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం ఆరు గంటలకు నగరంపాలెంలోని వెస్ట్ పారిస్ చర్చి హయ్యర్ హాల్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్, కంకరగుంట ఫ్లై ఓవర్, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, శంకర్ విలాస్, ఏసీ కాలేజీ వద్ద ర్యాలీ ముగుస్తుందని వివరించారు. నగరంలోని క్రైస్తవ విశ్వాసులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాస్టర్ మల్లెల రాజు, పాస్టర్ పాల్ మనోహర్, బాబు ఆశీర్వాదం, రత్న ప్రసాద్, ఆనందపాల్, విల్సన్, పరిశుద్ధరావు పాల్గొన్నారు.

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 25 నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి తెలిపారు. కళాశాలలో గురువారం శిబిరం పోస్టర్లను కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు ఆటవిడుపుతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా స్పోర్ట్స్, గేమ్స్ అంశాల్లో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ మాట్లాడుతూ అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా, ఆర్చరీ, వెస్ట్రన్ డాన్స్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం, టీ షర్ట్, జ్ఞాపిక బహుకరిస్తామని వివరించారు. వివరాలకు 98497 03144, 98498 54221 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి పాల్గొన్నారు.

పునాదులు నిర్మించిన స్థలాలు మరొకరికి పంపిణీ

- అర్హులు వారు కాదు మీకే ఈ స్థలాలు అంటున్న అధికారులు
- స్వర్ణభారతినగర్ బాధితుల ఆవేదన





జగనన్న కాలనీలోని పునాదులు నిర్మించిన స్థలాలను బాధితులకు కేటాయిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: సీఆర్‌డీఏ పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 నిర్మాణానికి అధికారులు పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు అన్నట్లు తయారైంది. అధికారుల తప్పిదమో.. నిర్లక్ష్యమో నేడు 200 కుటుంబాలకు నిలువ నీడ కరువయ్యేలా ఉందని బాధితులు వాపోతున్నారు. ఇళ్లను కోల్పోతున్న బాధితులకు ఇంటి స్థలాలను చూపుతామని అధికారులు తీసుకెళ్లి గతంలో జగనన్న కాలనీల్లో ఎవరికో కేటాయించిన స్థలాలను ఇవి మీకే కేటాయించాం అంటున్నారు. గతంలో అదే స్థలాలను అర్హులకు కేటాయించగా వారు ఆ స్థలాల్లో పునాదుల వరకు నిర్మాణాలు చేసుకుని ఉన్నారని బాధితులు వాపోతున్నారు. కానీ అధికారులు మాత్రం ఇవి మీకే కేటాయిస్తున్నాం.. వాళ్ళు అర్హులు కాదని, మీకే ఈ స్థలాలు అంటున్నారని బాధితులు అంటున్నారు. ఈ విషయం అసలు లబ్ధిదారులకు తెలియకపోవడం గమనార్హం.



రిట్ పిటీషన్‌కు స్పందించిన కోర్టు ఆర్డర్ కాపీ

వివాదాలకు తావుతీసేలా..

గతంలో ఇళ్ల నిర్మాణాలకు ఫౌండేషన్‌లు నిర్మించుకున్న వాళ్లు వస్తే మేమేం చేయాలి అని ఆయా అధికారులను బాధితులు అడగగా.. 'వాళ్లు వస్తే మావద్దకు తీసుకురండి.. మేం సమాధానం చెబుతాం' అంటున్నారని బాధితులు తెలిపారు. ఎవరికో కేటాయించిన స్థలాలలో మేము నిర్మాణాలు చేసుకుంటే వివాదాలు జరుగుతాయని.. తాము అలా నిర్మాణాలు చేసుకోలేమని బాధితులు తెలుపగా.. 'చేసేదేమీ లేదు. మేం చూపిన స్థలాల్లో కట్టుకోండి. లేకుంటే లేదు' అన్నట్లు అధికారులు సమాధానాలు చెబుతున్నారని బాధితులు వాపోయారు. ఇళ్లు కోల్పోతున్నాం మాకు న్యాయం చేయండని వేడుకుంటే వివాదాలకు తావిస్తూ ఆ స్థలాలను మాకు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తే గతంలోని అర్హులు వచ్చి గొడవ చేస్తే ఇరువురూ కేసులు పెట్టుకుని పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వస్తుందని బాధితులు అంటున్నారు. న్యాయం చేయమంటే మరో సమస్యలో తమను ఇరికిస్తున్నారని మండిపడుతున్నారు.

కోర్టును ఆశ్రయించిన బాధితులు..

అధికారులు ఎంత చెప్పినా వినకుండా.. బాధితులకు న్యాయం చేయకుండా.. ఆర్థిక భరోసాను కల్పించకుండా ఇళ్లను తీసివేయడంపై బాధితులు హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయగా కేసును పరిశీలించిన కోర్టు బాధితులకు న్యాయం చేసే వరకూ ఎటువంటి ఇబ్బందులు కలుగజేయవద్దని తెలిపిందని వారు తెలిపారు. తమకు ఆర్థిక భరోసాను కల్పించి చిన్నపిల్లలు, వృద్ధులతో ఉన్న తమకు ప్రస్తుతం నివాసం ఉండే ప్రాంతంలో ఇళ్లను చూపాలని బాధితులు కోరుతున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నామమాత్రంగా విద్యుత్ అదాలత్

- డివిజన్ స్థాయి సదస్సులో రెండు పదులు దాటని అర్జీలు
- మొక్కుబడిగా నిర్వహించిన అధికార యంత్రాంగం



విద్యుత్ వినియోగదారుడి సమస్య తెలుసుకుంటున్న సభ్యులు, అధికారులు



ఖాళీగా ఉన్న కుర్చీలు

పొన్నూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. ఏపీసీపీడీసీఎల్, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలో దొప్పలపూడిలోని ఓ కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. పలువురు వినియోగదారుల సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయనతో పాటు విద్యుత్ పంపిణీ సంస్థ బాపట్ల సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ఆంజనేయులు స్వీకరించారు. కాగా వేదికలో వినియోగదారుల కన్నా అధికారులు, సిబ్బంది మాత్రమే ఎక్కువగా పాల్గొన్నారు. సదస్సులో 15 అర్జీలు స్వీకరించినట్లు, వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అధిక విద్యుత్ బిల్లుల సమస్యలే అధికంగా వచ్చాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వేదిక అధ్యక్షులు ఇమ్మానియేలు హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన ఓ హోటల్ నిర్వాహకులు విద్యుత్ మూడింతలు ఎక్కువగా వచ్చిందని, బిల్లు కట్టలేని స్థితిలో ఉన్నానని తగ్గించే విధంగా చేయాలని కోరాడు. వినియోగదారుడికి బిల్లు తగ్గింపులో అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో బకాయిదారుడు వెనుదిరిగాడు.

లో ఓల్టేజీ సమస్యతో..

పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, పరిష్కరించాలని కోరితే అధికారులు అమర్యాదగా వ్యవహరించారని ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. డివిజన్ స్థాయి అధికారులు, సుమారు 10 మండలాల పరిధిలో సిబ్బంది నిర్వహణలో జరిగిన అదాలత్‌లో అర్జీలు రెండు పదులు కూడా దాటలేదంటే అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది. ప్రస్తుతం పెరిగిన విద్యుత్ ఛార్జీల కారణంగా ప్రభుత్వం, విద్యుత్ శాఖ పనితీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తనున్న నేపథ్యంలో మొక్కుబడిగా సదస్సు నిర్వహించారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమైంది. కార్యక్రమంపై ప్రచారం కొరవడి అంతంత మాత్రంగానే వచ్చిన అర్జీలను స్వీకరించి అధికారులు చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినబడ్డాయి. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఎ.సునీత, డీఈ జి.శ్యాంకుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 185 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 185 మంది డిగ్రీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్న కుమారి తెలిపారు. 19 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని ఆమె చెప్పారు. వివిధ కళాశాలల నుంచి 419 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, మాస్టర్‌మైండ్స్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ పేమెంట్స్, ఇన్నో సోర్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె. అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ, లక్ష్మణరావు, సుబ్బారెడ్డి, పవన్, చేబ్రోలు, వినుకొండ, బాపట్ల, మాచర్ల, చీరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రతిభావంతులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో సుబ్బారావు, తదితరులు

వేజెండ్ల(చేబ్రోలు): విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామస్తులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ పాఠశాలగా మారుతుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రతి విద్యార్థి, తల్లిదండ్రులు ఒక్కొక్కరు ఒక్కో విద్యార్థిని పాఠశాలలో చేర్చే విధంగా పనిచేయాలన్నారు. ప్రేరణ శిక్షణా సేవా సమితి సెక్రటరీ నోటు నాగార్జున మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ మిని మైండ్స్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీషు నిర్వహించామన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లీషులో పట్టు సాధించటానికి ఉపయోగపడుతుందన్నారు. పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం విజయశ్రీ,, పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసమూర్తి, సతీష్, లక్ష్మయ్య, తోట భువనేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

నగరంపాలెం: వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనకళ్ల సత్యం అన్నారు. గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కొత్తపేట ఫ్యాన్సీ కన్వెన్షన్ వద్ద ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ కొత్తపేట వైపుగా రాకపోకలు సాగించే వారికి ఉచితంగా మజ్జిగ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఇంటర్ విద్యార్థులకు సన్మానం

చేబ్రోలు: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించారు. దీంతో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడంతో పాటు వీరి కృషికి పాల్పడిన అధ్యాపకులు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కూటమి నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చేబ్రోలు: యువకుడిని మోసం చేసి ద్విచక్రవాహనంతో పరారైన నిందితుడిపై గురువారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన షేక్ సిద్దిఖ్ క్రికెట్ ఆటకని క్రీడా ప్రాంగణానికి తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గుర్తు తెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి తెలిసిన వారికి రోడ్డు ప్రమాదం జరిగిందని.. అడ్డరోడ్డు వరకు తీసుకువెళ్లాలని నమ్మబలికాడు. దీంతో సిద్దిఖ్ అతనిని అడ్డరోడ్డులోని బస్టాండ్ వద్ద దింపాడు. బండి దిగిన నిందితుడు పనిపై వెళ్లి వస్తానునని చెప్పి సిద్దిఖ్ బండి తీసుకుని పరారయ్యాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువకుడు చేబ్రోలు పోలీసులకు జరిగింది తెలుపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మే 20న రోడ్డు రవాణా కార్మికుల సమ్మె



లక్ష్మీపురం: లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో రోడ్డు రవాణా కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జి. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలుతో బానిస వ్యవస్థను భారతదేశంలో మరలా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర కోశాధికారి కె. దుర్గారావు, నాయకులు సురేష్, పోలినాయుడు, కె. నాగేశ్వరరావు, బి. లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్ వలి, ఎం. హరిపోతురాజు, ఎం. రాజా, జి. శంకర్రావు, రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

దయచేసి మా గోడు వినండి సారూ!

సౌత్ డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



డీఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

గుంటూరు రూరల్: పాత కక్షల నేపథ్యంలో మా కుటుంబాన్ని కొందరు వ్యక్తులు అంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని చౌడవరం గ్రామానికి చెందిన గుమ్మడిదల పూర్ణచంద్రరావు గురువారం సౌత్ డివిజన్ డీఎస్పీ భానోదయకు ఫిర్యాదు చేశారు. నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలిసి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. బాధితుడు పూర్ణ మాట్లాడుతూ.. 2022లో చిన్నసుబ్బయ్య అనే వ్యక్తితో తమ కుటుంబానికి గొడవలు జరిగాయని, అప్పుడు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశారని అన్నారు. ప్రస్తుతం కోర్టు వాయిదాలకు తిరుగుతున్నామని తెలిపారు. కోర్టులో కేసు జరుగుతుండగా ఇటీవల చిన్నసుబ్బయ్య అనే వ్యక్తి తెనాలికి చెందిన కొందరు రౌడీషీటర్లకు సుపారీ ఇచ్చి తనపై పలు మార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. మహిళలను సైతం భయభ్రాంతులకు గురి చేయగా స్థానికులు రావడంతో పరారయ్యారని.. వారిలో ఒకరిని నల్లపాడు పోలీసులకు అప్పగించగా పోలీసులు మిగిలిన వారిని సైతం అదుపులోకి తీసుకుని విచారించారన్నారు.

బయటే తిరుగుతున్న నిందితులు..

విచారణలో సుపారీ తీసుకుని హత్యాయత్నానికి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకొన్నారని అన్నారు. అయినప్పటికీ పోలీసులు స్పందించడం లేదని కేవలం హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్లను మాత్రమే పోలీసులు అరెస్ట్ చేశారని.. సుపారీ ఇచ్చిన చిన్నసుబ్బయ్య తదితరులు బయటే తిరుగుతూ తమ కుటుంబానికి ప్రాణభయాన్ని కలిగిస్తున్నారని వాపోయారు. నిందితులు కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఓ డీఎస్పీ అండతో కేసులు లేకుండా తిరుగుతున్నారని, వారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పొన్నూరు: తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. గురువారం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాస్, ఎల్లమ్మ, శారద, మదీనా, షకీల, యశోద, సారమ్మ, పద్మావతి, రత్నకుమారి పాల్గొన్నారు.

'బడిబాట'లో విద్యార్థుల ర్యాలీ



శేకూరు కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, ఉపాధ్యాయులు, తదితరులు.

చేబ్రోలు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ తరగతులు జరుగుతున్నాయని ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈవో తెలిపారు. హైస్కూల్ హెచ్ఎం ఎ.నరేంద్ర, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సీహెచ్ జోసఫ్ సుధీర్, రాఘవయ్య, మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో ఇంటింట ప్రచారం..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యేసుబాబు, కరీముల్లా, జి.వెంకటేశ్వరరావు, మేకల సుబ్బారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వర్ణభారతినగర్ బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్, తదితరులు

గుంటూరు రూరల్: స్వర్ణభారతనగర్‌లో నివాసాలను కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వర్ణభారతినగర్‌లో ఫేజ్ 3లో భాగంగా నివాసాలను కోల్పోతున్న బాధితులు తమకు అన్యాయం జరుగుతుందని.. ఇళ్లను కోల్పోతున్నామని తెలుపడంతో వారికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తగిన న్యాయం జరిగే వరకూ పోరాడుదామని భరోసా కల్పించారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంగా ముందుకు సాగాలని పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పి.శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం బుడంపాడు, నగరాలు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య అభివృద్ధి పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. గుంటూరు నగరంలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పట్ల ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాల మేరకు సీసీ రోడ్లు, డ్రైన్లనిర్మాణం చేస్తున్నామన్నారు. కార్మికులను రేషనలైజేషన్ ద్వారా పారిశుద్ధ్య పనుల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్రాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.